దేదీప్యమానం.. త్రిశక్తి ఆలయం

చదువుల తల్లి శ్రీ మహా సరస్వతి.. సంపదలనొసగే శ్రీ మహాలక్ష్మి.. శక్తి ప్రదాయిని శ్రీ మహాదుర్గ.. ముగ్గురమ్మలు కొలువుదీరిన అరుదైన ఆలయం త్రిశక్తి దేవాలయం. ముగ్గురమ్మలకు వేర్వేరు ప్రాంతాల్లో ఎన్నో ఆలయాలు ఉండటం చూస్తుంటాం.. కానీ త్రిశక్తులు ఒకేచోట కొలువుదీరిన అరుదైన క్షేత్రమిది. శరన్నవరాత్రుల వేళ స్టీల్‌ప్లాంట్‌లోని ఆలయ విశేషాలు, ఉత్సవాల సమాహారం..



విద్యుత్ వెలుగుల్లో త్రిశక్తి ఆలయం





ఆలయంలో కొలువుదీరిన శ్రీ మహాదుర్గ, శ్రీ మహాసరస్వతి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

- ముగ్గురమ్మలు ఒకే చోట కొలువైన ప్రాంగణం
- పరవశమవుతున్న భక్తజనం
- శరన్నవరాత్రులకు సన్నాహాల్లో నిమగ్నం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని త్రిశక్తి ఆలయం ఎంతో ప్రత్యేకం. నిత్యం అమ్మవార్లకు జరిగే వివిధ రకాల పూజల్లో పాల్గొనే వందలాది మంది భక్తులతో కళకళలాడుతుంది. పర్వదినాల్లో, శ్రావణమాసంలో, శరన్నవరాత్రి ఉత్సవాల్లో జరిగే విశేష అర్చనలతో ఆధ్యాత్మిక సుగంధాలను వెదజల్లుతుంది.

ఆలయం నిర్మాణం జరిగిందిలా..

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అమ్మవార్ల ఆలయ నిర్మాణం కోసం ఉక్కు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. పరిశీలించిన యాజమాన్యం ఉక్కు స్టేడియం ఎదురుగా స్థలాన్ని కేటాయించింది. దీంతో ఉద్యోగులు విరాళాలు సేకరించి ఈ త్రిశక్తి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి ముగ్గురమ్మ వార్లకు నిత్య పూజలు మొదలుకుని పర్వదినాల్లో ప్రత్యేక పూజల వరకు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి.

చదువులమ్మ కోవెలలో అక్షరాభ్యాసాలు

చిన్నారుల అక్షరాభ్యాసాలకు త్రిశక్తి దేవాలయంలోని శ్రీ మహాసరస్వతి ఆలయం ఎంతో ఖ్యాతి గాంచింది.

పారిశ్రామిక ప్రాంతవాసులతో పాటు పరిసర ప్రాంతాల వారు కూడా తమ పిల్లలకు ఇక్కడే అక్షరాభ్యాసం చేయిస్తుంటారు. ఇక నాగేంద్రుడి పూజల కోసం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నవనాగ శక్తి ఆలయానికి వస్తుంటారు.

శరన్నవరాత్రుల్లో అమ్మవార్ల అవతారాలు

తేదీ	మహాదుర్గ	మహాలక్ష్మి	మహాసరస్వతి	ప్రత్యేక పూజలు
15.10.23	బాల త్రిపుర సుందరి	ఆదిలక్ష్మి	భారతీ దేవి	పంచామృతాభిషేకాలు
16.10.23	గౌరీదేవి	విద్యాలక్ష్మి	సరస్వతి దేవి	సహస్ర సంపెంగ పుష్పార్చన
17.10.23	గాయత్రీదేవి	ధైర్యలక్ష్మి	శారదాదేవి	సహస్ర హస్త కంకణార్చన
18.10.23	అన్నపూర్ణాదేవి	సంతానలక్ష్మి	హంస	సహస్ర హరిద్ర ఖండార్చన
19.10.23	లలితా త్రిపుర సుందరి	గజలక్ష్మి	జగద్విఖ్యాత	సహస్ర కమల పుష్పార్చన
20.10.23	మహాలక్ష్మిదేవి	ధనలక్ష్మి	వాఘేశ్వరి	సహస్ర కలువ పుష్పార్చన
21.10.23	సరస్వతీదేవి	ధాన్యలక్ష్మి	కౌమారి	సహస్ర శ్వేత కుసుమార్చన సామూహిక అక్షరాభ్యాసాలు
22.10.23	దుర్గాదేవి	విజయలక్ష్మి	బ్రహ్మచారిణి	సహస్ర గులాబీ పుష్పార్చన సహస్ర దీపాలంకరణ
23.10. 23	మహిషాసురమర్దని	ఐశ్వర్యలక్ష్మి	బుద్ధిధాత్రి	సహస్ర ఫలార్చన
24.10.23	రాజరాజేశ్వరి	మహాలక్ష్మిదేవి	వరదాయిని	నవచండీ యాగ మహా పూర్ణాహుతి,శమీపూజ

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు త్రిశక్తి దేవాలయం సిద్ధమవుతోంది. ఆలయ కమిటీ, ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ తొమ్మిది రోజులు ఉదయం 7.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, యాగ దీక్షాధారణ, నవ చండీ మండపారాధన, కలశ స్థాపన, చండీ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 7 గంటలకు నిత్య గోత్రనామార్చన చేయనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మహా గణపతి, నవగ్రహ సహిత నక్షత్ర హోమం, నవ చండీ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. రోజూ రాత్రి 7 గంటలకు స్త్రీలచే సామూహిక సహస్ర కుంకుమార్చనలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెదగంట్యాడ: రోటరీ క్లబ్ గాజువాక సమతానగర్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఈ నెల 14న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణరావు తెలిపారు. సమతానగర్ రోటరీ ఫ్రీ హోమియో క్లినిక్ వద్ద శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో జనరల్, ఆర్థో, ఐ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ ఢీకొని స్టీల్‌ప్లాంట్ వాసికి గాయాలు

మర్రిపాలెం: బైక్ ఢీకొని స్టీల్‌ప్లాంట్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కోపిశెట్టి కోటేశ్వరరావు తన భార్య కుమారితో కలిసి స్టీల్‌ప్లాంట్‌లో నివసిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రిలో కుమారి నర్సుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి భార్యభర్తలిద్దరూ ద్విచక్ర వాహనంపై స్టీల్‌ప్లాంట్ నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఊరు వెళ్తున్న తన భార్యను రైలు ఎక్కించి తిరిగి భర్త ఇంటికి వెళ్తున్న క్రమంలో సుమారు రాత్రి 9.40 గంటల సమయంలో జ్ఞానాపురం గెడ్డ వీధి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి కోటేశ్వరరావును ఢీకొన్నాడు. కుడి కాలికి గాయాలైన అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్‌కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలాం బోధనలపై వ్యాసరచన పోటీలు

గాజువాక : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ బోధనలపై స్థానిక ట్వింకిల్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అని కలాం చెప్పిన అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న 230 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ ప్రదర్శించిన పది మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కరస్పాండెంట్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు, హెచ్ఎం

గాజువాక : హెచ్‌పీసీఎల్ విశాఖ టెర్మినల్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఆ సంస్థ అధికారులు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కాలుష్య నియంత్రణ అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకుముందు ఇదే అంశంపై సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంస్థ డిప్యూటీ మేనేజర్ పి.రామేశ్వర్ మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం మాసశివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. చెరుకూరి శ్రీనివాస్, వి.భాస్కరరావు, బి.వి.ఎస్.రామలక్ష్మి సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సుధాకర్, నాగేశ్వరశర్మ, రాధాకృష్ణ, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా డ్రై డే పాటించాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది, కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ విధిగా ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. నెహ్రూనగర్‌లో శుక్రవారం ఆయన మలేరియా విభాగం అధికారులతో కలసి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. నీటి నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేసే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్.వై.నాయుడు, బొడ్డు గోవిందు, అనపర్తి త్రినాథ్ లోకేష్, చంద్రశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి, కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దసరా ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



డ్రైవర్ కాలనీలోని ఆలయంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక : స్థానిక డ్రైవర్స్ కాలనీలోని సీతా సమేత కోదండ రామచంద్రస్వామి, కనకదుర్గ ఆలయంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆదేశాలతో ఉత్సవ కమిటీని నియమించినట్టు తెలిపారు. ఉత్సవాల ప్రారంభం నుంచీ ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, కుంకుమ పూజలు, చండీ హోమాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 25న భారీ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పల్లా రమణ, లాయర్ రెడ్డి, నీలాతి అచ్చిబాబు, జనార్ధన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిముక్కు రామాయలంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

నెల్లిముక్కులో..

పెదగంట్యాడ: నెల్లిముక్కు రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24 వరకు దేవి శరన్నవరాత్రి పూజా మహోత్సవాలు నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సీతారామాలయ పూర్వక షిర్డీసాయినాథ, కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించనున్నామని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు చేయనున్నామన్నారు. తొమ్మిది రోజులు విశేష అలంకరణలు ఉంటాయని చెప్పారు. 20న అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసాలు, 21న అన్న సమారాధన నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమంలో దూడ సింహాచలం రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, పులి రామరెడ్డి, గురుబిల్లి పోతురాజు, ధర్మాల పైడిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ఎక్కడా అవినీతికి తావు లేదని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పారదర్శకంగా పాలన చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో రూ.78.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.49 లక్షలతో గ్రామంలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాల షెడ్, వెయిటింగ్ హాల్ నిర్మాణం, రూ.29.10 లక్షలతో పంచవటి పక్క నుంచి సీసీ రోడ్డు, సీసీ కాల్వలు, కల్వర్టు నిర్మాణాలకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్షల కోట్లు ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబును ప్రజలు ఛీత్కరిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఇంకా ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతారని ఎద్దేవా చేశారు. 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, గొంతిన వెంకటలక్ష్మి, నంబారు రాజు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఉక్కు పోరాట కమిటీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను శుక్రవారం కలిశారు. ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి మిందిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసిన వారు.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని త్వరలో కలిసేలా అపాయింట్‌మెంట్ ఇప్పించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. గర్భం మాంగనీస్ లీజుల రెన్యువల్‌పై గనుల శాఖామంత్రితో మాట్లాడాలని మంత్రి అమర్‌నాథ్‌ను కోరారు. మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ నడిపేందుకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని కోరారు. పై అంశాలపై వినతిపత్రం సమర్పించగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని, త్వరలోనే ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్‌కు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ, ఎన్ఈపీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, కన్వీనర్ కె.ఎస్.ఎన్.రావు, కో కన్వీనర్లు ఎస్.రామచంద్రరావు, అయోధ్యరామ్, సభ్యులు వై.మస్తానప్ప, వి.రామ్మోహనరావు, బి.కామేశ్వరరావు, బి.అప్పారావు తదితరులున్నారు.



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు పోరాట కమిటీ ప్రతినిధులు

ఉక్కు కో-ఆపరేటివ్ బంక్‌లో వివాదం

- పెట్రోల్ నాణ్యతపై నిలదీసిన ఉద్యోగులు
- పరీక్షలతో సద్దుమణిగిన వైనం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంక్‌లోని పెట్రోల్‌పై శుక్రవారం వివాదం చెలరేగింది. పెట్రోల్‌లో నీళ్లు కలిపి నాణ్యత లేని పెట్రోల్ అమ్ముతున్నారని కొంతమంది ఉద్యోగులు చేసిన ఆరోపణలు ప్లాంట్ వాట్సప్‌ల్లో హల్‌చల్ చేయగా.. పాలకవర్గం ప్రతినిధులు రంగంలో దిగి వారి ఆరోపణలపై వివరణ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఒకరు ఉదయం బంక్‌కు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ కొట్టించగా పెట్రోల్ రంగు కొద్దిగా మారి ఉండటంతో నీళ్లు కలిపారంటూ హడావుడి చేశారు. దానికి కొంతమంది మద్దతు ఇవ్వడంతో బంక్ సిబ్బందిని నిలదీశారు. రెండు రోజుల పాటు వచ్చే పెట్రోల్ రంగు, రుచిలో కొద్దిపాటి తేడా ఉంటుందని హెచ్‌పీసీఎల్ అధికారులు తెలిపారని చెప్పారు. ఉద్యోగులు దానిని అంగీకరించక.. ఫిల్టర్ పేపర్‌తో తనిఖీ చేసి చూపాలంటూ డిమాండ్ చేశారు. సిబ్బంది ఫిల్టర్ పేపర్ తెచ్చి చూపినా ఉద్యోగులు శాంతించలేదు. ఈ విషయం తెలిసి కో-ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు బి.టి. జగదీష్, డైరెక్టర్ నాగబాబు వచ్చి హెచ్‌పీసీఎల్ అధికారులు పంపిన సమాచారాన్ని సభ్యులకు చూపించారు. నాణ్యత కలిగిన పెట్రోల్ సాంద్రత 700 పైగా ఉండాల్సి ఉండగా బంక్ పెట్రోల్ సాంద్రతను పరీక్షించగా 741.8 వచ్చింది. దీంతో ఉద్యోగులు శాంతించారు.



బాటిల్‌లో నింపిన పెట్రోల్

శరన్నవరాత్రులకు ఉత్సవ రాట



87వ వార్డులో ఉత్సవ రాట వేస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి యాదవ వీధిలో శ్రీ యాదవ కృష్ణ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం పందిరి రాట వేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని, అమ్మవారికి పూజ చేసి పందిరి రాట వేశారు. గొలగాని అప్పలకొండ, దేవర తాతారావు, జి.వెంకటరమణ, బొడ్డు రమణ తదితరులు పాల్గొన్నారు.



మెహర్ నగర్‌లో రాటను ప్రతిష్ఠిస్తున్న స్థానికులు

72వ వార్డులో..

గాజువాక : 72వ వార్డు మెహర్‌నగర్‌లో దసరా ఉత్సవాల నిర్వహణకు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాట ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాగిరి రామకృష్ణ, రఘు, శేషు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల శ్రమదానం

కాంక్రీట్‌తో గోతుల పూడ్చివేత



గోతుల్లో కాంక్రీట్ ఫిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గోతులను గాజువాక ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం పూడ్చారు. షీలానగర్ ఎన్‌హెచ్-16 రోడ్డు, పెట్రోల్ బంక్ వద్ద గల సర్వీసు రోడ్డు, షీలానగర్‌లోని సీఎంఆర్ గొడౌన్స్ ఎదురుగా రోడ్డులోని పలు ప్రమాదకరమైన గోతులను కాంక్రీట్‌తో పూడ్చారు. ఈ పనులను ఏసీపీ త్రినాథ్, టీసీఐ గాజువాక, టీఎస్ఐ సిబ్బంది పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ఢీకొట్టి వెళ్లిపోయిన కారు

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న పంజాబ్ హోటల్ ప్రాంతానికి చెందిన టి. పుణ్యవతి(14), ఊర్వశి ప్రాంతానికి చెందిన మనోజ్ కుమార్(20) రోడ్డు దాటుతుండగా ఎన్ఏడీ నుంచి తాటిచెట్ల పాలెం వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిలో బాలికను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, మనోజ్‌కుమార్‌ను 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఎయిర్ పోర్టు పోలీసులకు కారు ఆచూకీ కోసం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

పల్లా వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ మహిళా నేతల ఆగ్రహం

కూర్మన్నపాలెం: ఇటీవల కూర్మన్నపాలెంలో చోటుచేసుకున్న భూ తగాదాల్లో తన ప్రమేయం ఉందంటూ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగులూరి రోజారాణి ఖండించారు. పార్టీ మహిళా నేతలతో కలిసి రోజారాణి గాజువాక పోలీస్‌స్టేషన్‌లో పల్లా శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. పార్టీ మహిళా నేతలతో కలిసి గాజువాకలోని ఎస్‌బీటీ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రోజారాణి మాట్లాడారు. ఏ ఆధారంతో తన పేరును ప్రస్తావించారో చెప్పాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాలు, ఆక్రమణలు చేయడం పల్లా కుటుంబానికే చెల్లుతుందని, తిరిగి వాటిని తమపై రుద్దడం సరికాదన్నారు. దళిత వర్గానికి చెందిన మహిళనని చులకన చేస్తూ పల్లా వ్యాఖ్యలు చేయడం తనను ఎంతగానో బాధించాయన్నారు. ఇంతవరకు తాను ఎక్కడా భూ వివాదాల్లో తలదూర్చలేదని, అలాంటిది తన పేరును మీడియా సమావేశంలో ప్రస్తావించడం, హిజ్రాలను తీసుకొచ్చినట్టు మాట్లాడడం క్షమించరానిదన్నారు. తనను, తన సామాజిక వర్గాన్ని, పార్టీని కించపరిచేలా పల్లా మాట్లాడారని, దీనిపై స్పష్టత ఇవ్వకపోతే న్యాయం కోసం ఎంతటి పోరాటానికైన సిద్ధమని రోజారాణి స్పష్టం చేశారు. కార్యక్రమంలో విమలా థామస్, ధనాల ఉమాదేవి, వినీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రోజారాణి

ఘనంగా కృష్ణమయ్య జయంతి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతిని ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానంలో కృష్ణమయ్యకు ఎంతో విశిష్టత ఉంది. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిపై వచన సంకీర్తనలను కృష్ణమయ్య రచించారు. అంతటి ఘన కీర్తిని గాంచిన కృష్ణమయ్య జయంతిని ఏటా భాద్రపద చతుర్దశి నాడు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం చెంతన అర్చకు లు జయంతి పూజలు నిర్వహించారు.

ఉద్యమంతోనే కేంద్రానికి గుణపాఠం



శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతోనే కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 974వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని, సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.